# వెన్నెల రోజులు

ఉదయంనుండి వర్షం కురిసి సాయంకాలానికి తగ్గిపోయింది. రాత్రికి మబ్బులన్నీ తేలిపోయి చంద్రుడు తెల్లగా వెలుగుతున్నాడు. కొద్దిగా చలివేస్తోంది. స్వెట్టరు తొడుక్కుని కిటికీముందు కూర్చుని ఆలోచిస్తున్నాను-ఆ వెన్నెల, అంత అందమైన తెల్లని వెన్నెల ఎంతమందిని సంతోషపెడుతుందో అని. ఆలోచిస్తున్నకొద్దీ నాలో ఆవేదన పుట్టుకొస్తోంది. వెన్నెల నన్నుచూసి వెక్కిరిస్తున్నట్టనిపించింది. కిటికీ రెక్కలు మూసుకుని లైటు వెలిగించి చలికి దగ్గరగా ముడుచుకుని కూర్చున్నాను. అలా ఎంతసేపు కూర్చున్నానో నాకే తెలీదు.

వీధి తలుపు తోసుకుని ఝూనీ వచ్చింది. కూడా వెన్నెల్ను మోసుకొచ్చినట్టు తెల్లచీర కట్టుకుంది. చెవుల తెల్లటి నక్షత్రాలు మిలమిలా మెరిసాయి.

ఆమె లోపలికి అడుగుపెడుతూనే "ఈ రాత్రికే వెళ్ళిపోతున్నానండి. మీరు వారం రోజులు పోతేగాని ఇక్కడ్నుండి కదలనన్నారుకదా. పోనీ స్టేషనుకయినా వస్తారా?" అంది.

ఆమె వెళ్ళిపోతుంది. సుమారు ఆరు వందల మైళ్ళ దూరానికి వెళ్ళిపోతుంది. మళ్ళీ ఆమెను కలుసుకోవడం యీ జన్మలో పడదు. ఎప్పుడయినా ఆమె ఆలోచనవచ్చి వెతుక్కుంటూ అంతదూరం వెళ్ళినా-ఏమో ఆమె కనిపిస్తుందో లేదో. కనిపించినా ఆమె

పూర్తిగా మర్చిపోతుంది. ఇద్దరిమధ్యా స్నేహాన్ని నిలుపుకుంటూ ఉత్తరాలు రాస్తూ వుందామన్నా-అదీ సాధ్యంకాదు. ఆమె భర్తవున్న ఆడది! ఆయనకు అవన్నీ నచ్చుతాయో లేదో.

ఆమె వెళ్ళిపోతూ స్టేషను వరకూ రమ్మంది. ఆఖరిసారిగా కలుసుకుని సన్నిహితంగా కబుర్లు చెప్పుకుని విడిపోదామని ఆమె కోరుకుంటోంది.

'సరే' అని బయలుదేరాను. బండిలో ఆమె కూర్చుంది. బండి వెనక నడుస్తూ వెళ్తున్నాను. బండెక్కి కూర్చోమంది. వద్దులే అని తప్పించుకున్నాను.

ఎవరమూ ఏమీ మాట్లాడుకోవడంలేదు. నిశ్శబ్దాన్ని చీలుస్తూ చప్పుడుచేసు కుంటూ బండి ముందుకు పోతోంది. వర్షానికి రోడ్డంతా బురదబురదగా వుంది. అలవాటుపడ్డ గిత్త లెక్కచేయకుండా గజ్జెల్ని ఊపుకుంటూ దౌడు తీస్తోంది. నడవలేక వెనకపడ్డాను. బండి ఆపించి లోపలకు ఎక్కికూచోమంది. ఎదురుచెప్పలేదు.

బండిపోతూవుంటే రఘానీ ముందుకు వంగివంగి పొలాల్నీ, ప్రకృతినీ పరిశీలిస్తోంది. నేను ఊరికే వెనక్కు జారబడి కూర్చున్నాను. బండి స్టేషను చేరేవరకూ యిద్దరిమధ్యా ఏ సంభాషణా తలెత్తలేదు. హృదయం అనేక ఆలోచనలతో నిండిపోయి బరువుగా వుంది. కొద్దిరోజుల పరిచయానికే ఆమెను విడిచిపెట్టడం దిగులుగావుంది.

స్టేషను చేరేసరికి రైలుదాటిపోయింది. మూడుగంటలు పోతేగాని మరో బండిలేదు. అంతవరకు ఆ పల్లెటూరి స్టేషన్లో చలికి వణుకుతూ, మంచుకి తడుస్తూ గడపాలి! పెద్ద స్టేషనుకూడా కాదది. రెండుగదుల చిన్న బిల్డింగు, ముందు రేకుల షెడ్డు, అటూయిటూ నాలుగు బెంచీలు వేసివున్నాయి. చెరోవైపు బెంచీలకు నీడగా నిటారుగా గుబురుగా రెండు తురాయిచెట్లు పెరిగాయి. స్టేషన్లో సరిగా దీపాలుకూడా వున్నట్టు లేవు, ఒకటి ఆరిపోయి, మరోటి ఆరిపోబోయి వెలుగుతోంది!

షెడ్డులో ముసుగుల్ని కప్పుకుని దగ్గరకు ముడుచుకుపోయి అరడజనుమంది నేలమీద దొర్లుతున్నారు. ఎక్కడా అలికిడిలేదు. అంతా నిశ్శబ్దంగా వుంది. టిక్కెట్లు అమ్మేఅతను కుర్చీలో కళ్ళుమూసుకుని గుర్రుపెడుతున్నాడు.

"చూశారా! ప్రాముఖ్యంలేని యీ పల్లెటూరి వెనక ఎంత చరిత్ర దాగి వుందో!" అంది ఆమె. మెల్లగా నవ్వాను.

ఆమె సామానుల్ని మోసుకొని వెళ్ళి ఓ చెట్టు మొదల్లో వుంచి బెంచీమీద

చతికిలబడి "రండి కూర్చోండి" అంది.

కూర్చోలేదుగాని వెళ్ళి బెంచీపక్కనే నుంచున్నాను.

"ఊహూ...మొగమాటపడతారేం, కూర్చోండి. మళ్ళీ మనం కలుసుకోలేంగా" అంది.

మరోమాటలేకుండా వెళ్ళికూర్చున్నాను. కొంచెంసేపు మౌనంగా వుండిపోయి ఆమె అంది-

"ఇప్పుడు చెప్పండి. ఏమైనా మనకు కొద్దిగంటలు మాత్రమే వ్యవధి. ఈ కొద్దిపాటి సమయాన్ని సంతోషంగా గడిపేయాలి. అటుతర్వాత మనం దూరమైపోతాం. క్రమంగా ఒకళ్ళనొకళ్ళం మర్చిపోతాం. బండికదిలితే మీరెవరో నేనెవర్నో! అందుకే మనం యీ కొద్దిపాటి సమయాన్ని కబుర్లతో నింపేద్దాం. చెప్పండి, ఏవైనా మంచి కబుర్లు చెప్పండి"

కాని ఏం మాట్లాడాలి? అకస్మాత్తుగా వచ్చి ఆశ్చర్యంలో ముంచి ఆమె వెళ్ళిపోతోంటే నాకు ఏం మాట్లాడాలో తెలీడమే లేదు. అయినా యిద్దరిమధ్యా ఏమున్నాయని అంత సన్నిహితంగా మాట్లాడుకోడానికి. ఆమె పెళ్ళయిన ఆడది. నేను పెళ్ళికాబోతున్న మగాడిని. అలాంటి వ్యక్తులమధ్య ప్రేమపై నాకు నమ్మకంలేదు. అదీగాక ఆమెతో నాకున్న పరిచయంకూడా అంతంతమాత్రమే.

నాగార్జునకొండ దగ్గర పరిచయమైంది. బౌద్ధశిల్పాల్ని మరికొన్నిటిని చూద్దామని అమరావతి వస్తోంటే తానూ నాతోపాటు వచ్చింది. చుట్టుపట్ల మరికొన్ని ఊళ్ళు తిప్పి చూపించాను. మూడు స్కెచ్‌బుక్‌లు నింపుకుంది. ఆమె నైపుణ్యంముందు నేనెందుకూ పనికిరానని అర్థమైపోయింది. మొక్కుబడిగా ఒకటీ అరా బొమ్మలుమాత్రమే గీసి ఊరుకుండిపోయాను.

అయిదు రోజులు కలిసి తిరిగాం. సరదాగా గడిచిపోయింది. ఈ రోజు ఆమె వెళ్ళిపోతుందని తెలుసు. చెప్పడానికి వస్తుందికదా అని బైటికి వెళ్ళకుండా హోటలు గదిలోనే వుండిపోయాను. హోటలు కూడా కాదది. భోజనం పెట్టేయిల్లు. బతిమాలితే రెండుగదులు యిచ్చాడు-ఆ మూడు రోజులూ వుండడంకోసం.

ఈరోజు ఆమె వెళ్ళిపోతూ, రాత్రి ఒక్కడ్నీ ఏకాంతాన్ని కావలించుకుని నిశ్శబ్దాన్ని పరామర్శిస్తుండగా వచ్చి తనకూడా స్టేషనుకు తీసుకొచ్చింది.

ఈ అయిదు రోజుల్లోనూ తనగురించి ఆమె ఏమీ చెప్పుకోలేదు. కాకతాళీయంగా

తన భర్త యూనివర్శిటీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న విషయంమాత్రం చెప్పింది. ఎంతసేపూ శిల్పాలగురించే మాట్లాడింది. నేనుకూడా నా గురించి ఏమీ చెప్పుకోలేదు. అందుకే ఆమె సన్నిహితంగా మాట్లాడుకుందాం అన్నప్పుడు ఏం మాట్లాడాలో తెలీక చాలాసేపు మౌనంగానే వుండిపోయాను. ఆమె నావయిపే చూస్తువుంటే చివరకు నేనే అడిగాను "మీరే ఏమయినా చెప్పండి" అని.

ఆమె మాట్లాడ్డం మొదలెట్టి చాలా విషయాలు చెప్పింది. నేను ఊరికే వింటూ కూచున్నాను. ఆమె కలకత్తాలో యిదివరకు ఒక ఎగ్జిబిషను పెట్టిందట. మళ్ళీ త్వరలోనే మరో ఎగ్జిబిషన్ పెట్టబోతోందిట. ఆమె భర్త యునెస్కో స్కీంక్రింద ట్రయినింగ్‌కని బైటికి వెళ్తే, తాను ఓమారు యీ ప్రాంతాలన్నీ చూసివద్దామని యిటొచ్చిందట. స్కెచ్‌బుక్‌కూడా ఒకటి ఎవరో అచ్చువేస్తామన్నారట. ఇందులోంచి కొన్ని స్కెచ్‌లు చేర్చుతుందట. ఇంకా అలానే ఆమె చాలా విషయాలు చెప్పింది. "మీ తెలుగుదేశం ఎంత అదృష్టమైనది! ఇక్కడ ఎక్కడ చూసినా అపూర్వ కళాఖండాలే...."

నేను వింటున్నానో లేదో నాకే తెలీడంలేదు. కళ్ళు మూతలుపడుతున్నాయి. ఆమె చెప్పడం ఆపి "నిద్రవస్తున్నట్టుందిమీకు" అంది.

"లేదు" అన్నాను కళ్ళు తెరిచి నవ్వి. 'మరి?' అన్నట్టుగా చూసింది. "వెన్నెల్ని చూస్తూ ఆలోచిస్తున్నాను" అన్నాను.

ఝునీ ఓమారు చుట్టూ చూసింది. దీర్ఘంగా ఓ నిట్టూర్పు విడిచి అంది "అవును! ఎంత అందంగా వుందో వెన్నెల! ఇలాటి వెన్నెల ఎంత చక్కని అనుభూతుల్ని పంచుతుందో, ఎన్ని ఆనందాల్ని రాల్చుతుందో ఎప్పుడైనా ఆలోచించారా? విశాలమైన మైదానాల్లోనూ, నిశ్శబ్దంగా నిద్రపోతున్న పల్లెలపైనా, సన్నిహితంగా కూర్చున్న ప్రేయసీ ప్రియుల మధ్యా ప్రతిఫలించి మరింతగా గుబాళిస్తుంది. ఇలాంటి వెన్నెల్ని అనుభవించే అదృష్టం మీకువుంది. కాని మహా నగరంలో పెద్దపెద్ద మేడల్లో ఓమూల ఏ చీకటి కోణంలోనో వుంటూ ఎలక్ట్రిక్ దీపాలకాంతుల్లో గడిపే నాలాంటిదానికి వెన్నెల అందాన్ని అనుభవించే అదృష్టం లేకపోయింది. ఇలాటి తెల్లని చల్లని వెన్నెల్ని చూసినప్పుడల్లా ఆ వెన్నెల్లో ఎక్కడికో దూరానికి నడిచి వెళ్ళిపోవాలనిపిస్తుంది. నా జీవితంలో వెన్నెలమధ్య గడిపిన రోజులున్నాయనుకుంటే అవన్నీ ఆయనతోనే"

"ఆయనెవరు?" కుతూహలంగా అడిగాను.

ఆమె మెల్లగా ఓ చిరునవ్వు నవ్వింది. "ఆయనే...మావారు. పాట్నాలో ఓ ఎగ్జిబిషన్లో తొలుత పరచయమయ్యారు. మా వూరువచ్చి అక్కడే సంవత్సరంపాటు ఉన్నారు. ఆనాటి వెన్నెలరాత్రిళ్ళు మర్చిపోలేని మధుర స్వప్నాలు! గంగానది వొడ్డున విశాలమైన పచ్చటి చేలల్లో తెల్లటి వెన్నెల్లో ఆరోజులన్నీ ఆనందంగా గడిచిపోయాయి. అక్కడే యిరువురమూ పెళ్ళి చేసుకున్నాం. అటుతర్వాత కలకత్తాకు వెళ్ళిపోవలసి వచ్చింది. అక్కడ వారికి ఉద్యోగం వచ్చింది".

ఆమె అలా చెప్తూ నాకేసి తిరిగి "మరి మీకో?ఈ వెన్నెల ఏ అనుభవాల్నీ సృష్టించలేదూ?" అంది. లేదన్నట్టుగా తలవూపాను.

"మీరు గృహస్తులుకారా?" ఆమె తిరిగి అడిగింది.

నీరసంగా నవ్వాను.

అర్థమైనట్టుంది. "మరి ఎవరినీ ప్రేమించలేదూ?" అంది తిరిగి.

నాకు సిగ్గనిపించింది. "లేదు" అన్నాను. మౌనంగా కొద్దిసేపు వూరుకుని ఝూనీ నావంక జాలిగా చూసింది.

చాలాసేపు ఎవరమూ ఏమీ మాట్లాడుకోలేదు. నిశ్శబ్దం చుట్టూరా ఆవరించింది. చంద్రుడు మేఘాల్లోకి వెళ్ళి మళ్ళీ బైటికి వచ్చాడు. చలిగాలి జోరుగా వీస్తోంది. పైనుంచి మంచుపడి తొడుక్కున్న బట్టలు చల్లగా అయిపోయాయి. ఝూనీ పవిటను తలమీదకు లాక్కుని దగ్గరగా ముడుచుకుని కూర్చుంది. ఆమె కట్టిన తెల్లటి చీర వెన్నెల్లో మిలమిలలాడుతోంది. చలికి పెదవులు మెల్లగా కంపిస్తున్నాయి. తలమీది తురాయి చెట్టు ఆకులు మెల్లగా కదిలి చిన్నగా శబ్దం చేసాయి. ఒకటి రెండు ఆకులు ఎగిరివచ్చి మీదపడ్డాయి. నిశ్శబ్దం చెదిరింది.

"మన పరిచయం మీకు చిత్రంగాలేదూ?" ఝూనీ మౌనాన్ని చీల్చి అడిగింది.

"ఉంది. ఇదంతా వాస్తవంలా అనిపించడంలేదు. ఇద్దరు అపరిచిత వ్యక్తులు చిన్న సంఘటనద్వారా యింత సన్నిహితులు కావడం ఆశ్చర్యంగా వుంది"

"ఆర్టిస్టులంటే నాకెంతో అభిమానం. అదీగాక యీ భాష నాకు కొత్త. మీరు తెలుగువారే అయినా చక్కగా హిందీలో మాట్లాడుతున్నారు. మీరు కలిసిన తర్వాత ప్రాణం లేచివచ్చినట్టుంది".

బండి వస్తున్నట్టుంది, గంటకొట్టారు.

దూరంగా కూతవినిపించింది. నిశ్చలంగా వున్న వాతావరణంలో ఒక్కసారిగా సంచలనం కలిగింది. నిద్రపోతున్నవారు అదిరిపడి లేచినుంచున్నారు. తురాయి చెట్టుమీది పక్షులు రెక్కలు ఆడించుకొంటూ ఎగిరిపోయాయి.

ఝూనీ లేచినుంచుంది. మంచుతెరలమధ్య వికసిస్తున్న మొగలిపువ్వులావుంది. నిద్రలేకకాబోలు రెప్పలు బరువుగా వున్నాయి. ఆమె ముఖంలో ఆతృతలేదు. నిశ్చలంగా నా ముఖంలోకి చూస్తూ అడిగింది—"ఇంకేమయినా చెప్పవలసినది వుందా?"

ఆలోచిస్తూ జవాబు చెప్పడమే మర్చిపోయాను. బండివచ్చింది. సామానుల్ని లోపలికి ఎక్కించి ఆమెకూడా ఎక్కి తలుపుదగ్గర నుంచుంది.

ఆమెను ఒక విషయం అడగాలనుకున్నాను. కలకత్తాలో ఎక్కడవుంటోంది? అడ్రసు ఏమిటి?-అని. కాని అడగలేదు. ఆమె యీ పరిచయాన్ని బండెక్కిన మరుక్షణంలోనే మర్చిపోవాలని కోరుతున్నట్టుంది. ఉత్తరాలతోపరిచయం కొనసాగించడం ఆమెకు యిష్టంలేనట్టుంది. లేకపోతే యిన్నిరోజులు కంపెనీయిచ్చినందుకు నా అడ్రసు అడిగితీసుకునేదే. అలాగే ఆమె అడ్రసూ యిచ్చివుండేది.

బండికదిలింది. "వెన్నెల రాత్రిళ్ళు మీ జీవితానికి ఆనందాన్నీ, మర్చిపోలేని అనుభూతుల్నీ అందివ్వాలని ఆశిస్తున్నాను" అంది. ఆమె అలా అంటూనే చెయ్యివూపుతూ దూరమైపోయింది.

బండి వెళ్ళిపోయాక స్టేషన్లోనూ, ఆకాశంకిందా, పొలాలచుట్టూ తెల్లటి వెన్నెల ఒంటరిగా మిగిలిపోయింది.

ఆనాటి మంచుకురిసిన రాత్రి వెన్నెల మెల్లగా వెళ్ళిపోయింది. అలాంటి వెన్నెల దినాలు యింకా చాలా గడిచిపోయాయి. ఝూనీ ఆశించినట్టుగా ఆ దినాలు నాకు ఆనందాన్ని యిచ్చాయోలేదో తెలీదు. కాని మూడు సంవత్సరాల తేడాతో ఝూనీకు రెండు ఉత్తరాలు రాశాను.

ఒకటి-వెన్నెల రాత్రుళ్ళలోని మధుర మధుర భావాలు, ఆనాటి మర్చిపోలేని అనుభూతులు, జీవితంలో అవి అందించిన ఆనందాలు ఆమెకు తెలియజేస్తూ వ్రాసినది.

మరొకటి-వెన్నెలరాత్రుళ్ళు ఏకాంతంగా గడుపుతూన్న రోజులు, అందులోని

నిరాశ, వాటిమీద అసూయ, ఆకర్షణలేని ఆనందంలేని రోజులు, గతాన్ని జ్ఞప్తికితెచ్చి గుండెల్ని బరువెక్కించే దయలేని వెన్నెలరాత్రుళ్ళగురించి వ్రాసినది.

కాని, ఒక్కటీ ఆమెకు పంపించలేదు. నాదగ్గరే ఏమూలనో ఆరెండూ యింకా అలానే పడున్నాయి. ఎప్పుడయినా ఆమె అనుకోకుండా కలుస్తే, ఆమె అడ్రసు తెలిస్తే, ఆ రెండు ఉత్తరాలూ ఆమెకు అందజేయాలి.